# కథాకేళి

మల్లాది వెంకట కృష్ణమూర్తి

జోగులు, గంగులు రోజూ ఉదయం సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలుదేరే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కి విజయవాడ దాకా ప్రయాణం చేస్తారు. ఆ రోజు విజయవాడలో వుండిపోయి మర్నాడు మళ్ళీ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ చేరుకుంటారు.

ఇది వాళ్ళ వృత్తి.

ఒక్కోసారి విజయవాడ నుంచి కోణార్క్‌లో వైజాగ్ దాకా వెళ్ళి మళ్ళీ విజయవాడకి మర్నాడు కోణార్క్‌లోనే వస్తారు.

అలా అని చెప్పి వాళ్ళు రైల్వేలో పనిచేసే ఏ రైలు డ్రయివరో, గార్డో కారు.

పేకాటలో రైలు ప్రయాణీకులని మోసం చేసే జూదగాళ్ళు జోగులు, గంగులు.

పేకాట పిచ్చి వున్న ప్రయాణీకులని ఆకట్టుకుని వాళ్ళతో జూదం ఆడడం ఆ ఇద్దరి వృత్తి.

వాళ్ళకి ఓ పద్ధతి వుంది. ఇద్దరు ఒకరిని మరొకరు పరిచయం లేనివాళ్ళలాగానే ప్రవర్తిస్తారు. జోగులు, గంగులు కలసి ఆడతారు. వాళ్ళ పేకాట చూసేవాళ్ళు జోగులు ఓడిపోవడం, గంగులు గెలవడం గంగులు ఏభై రూపాయల దాకా తేలికగా సంపాదించడం చూస్తారు.

జోగులుకి పేకాట ఆడడం సరిగ్గా రాకపోయినా, ఆడాలనే కుతూహలం కలవాడిగా గుర్తిస్తారు. అతనితో పేకాట ఆడి గెలవడం తేలిక అని ఆటకి దిగుతారు.

“ఎప్పుడూ నేనే గెలిచేది. ఇవాళెందుకో అన్ని ఆటల్లో ఓడిపోయాను. ఈసారి గెలుపు నాదే. మన పందెం డబ్బు ఇతని దగ్గర వుంచుదాం.”

గంగులుకిస్తాడు. అతనితో ఆట ఆడే వ్యక్తి కూడా గంగులుకిస్తాడు పందెం డబ్బు.

మొదటి ఆటలో జోగులు ఎప్పటిలాగే ఓడిపోతాడు. అతనితో ఆట ఆడిన వ్యక్తి పాతిక రూపాయల దాకా గెలుచుకుంటాడు. తర్వాత ఆటలో జోగులు మళ్ళీ ఓడిపోతాడు. మరో ఏభైపైనే గెలుచుకుంటాడు జోగులుతో ఆడే ప్రయాణీకుడు.

ఇలా రెండు మూడు ఆటల్లో ఓడించి, అతనిని కొంత సంపాదించనిచ్చి అప్పుడు జోగులు తన పథకంలోని ఆఖరి అంశాన్ని అమలుపరుస్తాడు. ఎక్కువ స్టేక్‌కి ఆడదామంటాడు.

ఓడిపోయే కొద్దీ జోగులులో పట్టుదల పెరుగుతోందని గ్రహించిన ప్రయాణీకుడు అందుకు అంగీకరిస్తాడు.

ఆ ఆటలో పెద్ద స్టేక్‌లో తనకి పోయిందే కాక ఎక్కువ మొత్తం గెలుచుకుంటాడు జోగులు. ఆ తర్వాత ఆటలో మరి కొంత గెలుచుకుంటాడు జోగులు. ఆఖరి రెండాటల్లో జోగులు పేకముక్కలని



ఎంతో లాఘవంగా, తనకి అనుకూలం కలిగేలా మారుస్తున్నాడని ఒక్క గంగులుకే తెలుసు.

ఆ రోజు జోగులు, గంగులు విజయవాడలో రైలెక్కి పేకాట ఆడుతూ ఎరగా ఎవరు తగులుతారా అని ఎదురుచూస్తున్నారు. రైలు ఖమ్మంకి వచ్చేసరికి ఒకతను వచ్చి జోగులు, గంగులు ఆటని గమనించసాగాడు.

అతను గమనిస్తున్న కొద్దీ జోగులు ఇంకాస్త ఎక్కువ ఓడిపోసాగాడు. రైలు వరంగల్‌కి వచ్చేదాకా ఆ పెద్ద మనిషి నిశ్శబ్దంగా వాళ్ళ ఆట గమనిస్తూనే వున్నాడు. వరంగల్‌లో అడిగాడు జోగులు వుండబట్టలేక.

“మీకొచ్చా?”

తలూపాడు అతను.

“అయితే ఆడదామా?”

మళ్ళీ తలూపాడతను.

జోగులు రెండు పదిరూపాయిల కాగితాలు తీసి గంగులుకిచ్చి, ఆ ఆట నియమాలు చెప్పాడు. అతను రెండు పది రూపాయిల నోట్లు తీసి గంగులుకిచ్చాడు.

ఆట మొదలైంది. వాళ్ళ పథకం ప్రకారం జోగులు ఓడిపోయి, ఆ పెద్ద మనిషి గెలవడంతో గంగులు ఇరవై ఆ పెద్ద మనిషికి ఇచ్చేశాడు.

రెండవ ఆటలో కూడా ఆ పెద్ద మనిషి గెలిచేలా ఆడాడు జోగులు. అతనికి మరో ఏభై రూపాయిలు కలిసొచ్చింది.

“సాధారణంగా మూడో ఆటలో నేనే గెలుస్తుంటాను. ఈసారి జాగ్రత్తగా ఆడండి” హెచ్చరించాడు జోగులు ఆ పెద్ద మనిషిని.

అతను బదులుగా నవ్వాడు.

మూడో ఆటలో కూడా అతనే గెలవడంతో గంగులు ఒప్పందం ప్రకారం అతనికి వంద ఇచ్చాడు. నాలుగవ ఆటలో కూడా ఆ పెద్ద మనిషే గెలిచాడు.

## పెద్ద మనిషి

ఈసారి స్టేక్స్ పెంచడంచేత రెండువందలు సంపాదించుకున్నాడా పెద్ద మనిషి.

మళ్ళీ ఆట మొదలైంది. ఈసారి ఎవరు గెలిస్తే వాళ్ళకి అయిదువందలు లాభిస్తాయి. జోగులు, ఆ పెద్ద మనిషి ఎంతో ఆలోచించి, జాగ్రత్తగా ఆడసాగారు.

ఈసారీ ఆ పెద్ద మనిషే గెలవడం గంగులికి ఆశ్చర్యం వేసింది. జోగులు ఇన్ని ఆటలెందుకు ఇస్తున్నట్టు అనుకున్నాడు మనసులో.

మళ్ళీ స్టేక్స్ పెంచారు.

వెయ్యి రూపాయిలు!

ఈసారి తప్పనిసరిగా జోగులు గెలుస్తాడనుకున్నాడు గంగులు. కాని ఆ పెద్ద మనిషే గెలిచాడు. వెయ్యి ఇచ్చాడు గంగులు అతనికి.

“మళ్ళీ ఆడతారా?” అడిగాడతను వుత్సాహంగా.

జోగులు దిగులుగా చూసి తల అడ్డంగా వూపాడు, ఇక అతని దగ్గర డబ్బు లేకపోవడంతో.

ఆ పెద్ద మనిషి లేచి తన కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళాక అడిగాడు గంగులు కోపంగా.

“ఎందుకన్ని ఆటలు ఇచ్చేసావు?”

“నేనివ్వలేదు. ఆయనే తీసుకున్నాడు. ఇదే నా మొదటి ఓటమి” బాధగా చెప్పాడు జోగులు.

“ఈరోజు బాలేదులా వుంది” చెప్పాడు గంగులు.

“ఈరోజు బాలేకపోవడం కాదు. అతనెవరో తెలీదా?” అడిగాడు పక్కనున్న ఓ ప్రయాణీకుడు నవ్వుతూ.

“ఎవరు?” అడిగారు జోగులు, గంగులు ఒకేసారి.

“మెజీషియన్ బి.వి. పట్టాభిరాం” చెప్పాడతను నవ్వి.